క్లుప్తంగా

ఘనంగా ఎంఎస్ సుబ్బలక్ష్మి జయంతి

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఎంఎస్ సుబ్బలక్ష్మి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు: స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం సీతారాం ఏచూరి సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి గౌస్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ ఆయన ఆశయ సాధన కోసం పోరాడాడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సురేష్, ఈశ్వరయ్య, కుళ్లాయప్ప, చిదంబరం, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

- దంపతులకు గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌ను ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీ కొంది. ప్రమాదంలో బైక్‌లో ప్రయాణిస్తున్న లచ్చానపల్లినికి చెందిన నాగరాజు, దేవి దంపతులు గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





గాయపడిన హనుమేష్ వెంకటరాముడు

గుత్తి: మండలంలోని కరిడి కొండ గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో యువకులు హనుమేష్, వెంకటరాముడు తీవ్రంగా గాయపడ్డారు. కె. ఊబిచెర్ల గ్రామానికి చెందిన వెంకటరాముడు, హనుమేష్ గుత్తికి బైక్‌లో వెళుతుండగా మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి 'స్వచ్ఛతా హీ సేవ'

యల్లనూరు: మండలవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో మంగళవారం నుంచి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. చెత్త సంపద తయారీ వంటి అంశాలపై పల్లెల్లో అవగాహన కల్పించాలని ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు సూచించారు.

గార్లదిన్నె: మండలంలో మంగళవారం నుంచి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి విజయభాస్కర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పాల్గొం టారన్నారు.

ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరి

గార్లదిన్నె: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 23లోపు ఈ– క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ సోమశేఖర్ సూచించారు. సోమవారం ఏఓ మాట్లాడుతూ మండలంలో 7,384 మంది రైతులు 28 వేల ఎకరాలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్నారన్నారు. అలాగే ఇప్పటి వరకూ 3,855 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకున్నారన్నారు. ఈ కేవైసీ చేయించుకొని రైతులు రైతు సేవా కేంద్రాల్లో వెంటనే చేయించుకోవాలన్నారు.

రాయలచెరువులో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: మండలంలోని రాయలచెరువు లయన్స్ క్లబ్ కార్యాలయంలో సోమవారం మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు వంద మందికి డయాబెటిస్, బీపీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా సూర్యనారాయణ, సభ్యులు రవి ప్రసాద్, సత్యనారాయణ, ఇస్మాయిల్, అల్లా బకాష్, అశోక్, మురళి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేటీకరణ సరికాదు

ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో కొత్తగా 5 వైద్య కళాశాలలు ప్రారంభించాల్సి ఉంది. వీటి ద్వారా ఒక్కో కళాశాలకు 150 సీట్లు వచ్చేవి. అయితే వైద్య కళాశాలలు నడపలేమంటూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడం విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడమే. వైద్య కళాలలను ప్రైవేటీకరణ చేయడం దారుణం. వెంటనే ఈ నిర్ణయం వెనక్కుతీసుకోవాలి.

– నవీన్,
బీఫార్మసీ విద్యార్థి, బుక్కరాయసముద్రం





వైద్య విద్యార్థులకు కష్టాలు

ప్రభుత్వ వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం అంటే పేద, మధ్య తరగతి విద్యార్థుల నెత్తిన పిడుగు పడినట్లే. కొత్త మెడికల్ కళాశాలలో సీట్లు వద్దని ప్రభుత్వం లేఖ రాయడం ఆశ్చర్యంగా ఉంది. ఏ ప్రభుత్వమైనా మెడికల్ కాలేజీలలో సీట్లు పెంపు కోసం కృషి చేయాలి. ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం వ్యవహారం సరికాదు.

–చెన్నారెడ్డి,
రైతు సంఘం మండల కార్యదర్శి, గార్లదిన్నె

ప్రవక్త మార్గం అనుసరణీయం

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో మిలాద్ ఉన్ నబీ వేడుకలను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మక్కా మసీదు నమూనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ముస్లింలు దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

- భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ
- దర్గాల్లో ముస్లింల ప్రార్థనలు



గుత్తిలో మక్కా మసీదు నమూనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు



తాడిపత్రిలో నిర్వహించిన జులుస్‌లో పాల్గొన్న ముస్లింలు

గుంతకల్లు: ప్రశాంత జీవనానికి మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో పయనించాలని వక్తలు పిలుపునిచ్చారు. గుంతకల్లు నియోజకవర్గంలోని ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. గుంతకల్లు పట్టణంలోని పోర్టర్‌లైన్‌లోని గులాంషా ఖాద్రీ బాబా దర్గాలో ప్రభుత్వ ఖాజా సయ్యద్ అబ్దుల్ రజాక్ పీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇమాతే ఇస్లాహి మిల్లత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.పవన్ కుమార్‌గౌడ్ ప్రారంభించారు. యువకులు బైక్ ర్యాలీగా ముందుకు సాగారు. మక్కా మసీదు నమూనలు. మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన జెండాలను ప్రదర్శించారు. నారె–ఏ–తక్బీర్..అల్లాహు అక్బర్ అనే నినాదాలతో ఊరేగింపు సాగింది. డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఐలు మనోహర్, మస్తాన్ తదితరులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో సోమవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ(మహ్మద్ ప్రవక్త జన్మదినం) వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోటలోని ఆసార్ మసీదు వద్ద నుంచి ఊరేగింపు నిర్వహించారు. మక్కా మసీదు నమూనాలను వాహనాల్లో ఉంచి ఉరేగించారు. ఊరేగింపులో ముస్లిములు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆసార్ మసీదు, కట్ట మీద సాహెబ్ మసీదు లలో మహమ్మద్ ప్రవక్త కేశాలను ప్రదర్శించారు. అలాగే కొత్త పేట, ఎంగిలిబండ, జక్కల చెరువు, బసినేపల్లి, ఊటకల్లు, ఊబిచెర్ల, అబ్బేదొడ్డి గ్రామాల్లో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ముస్లింలు ఘనంగా నిర్వహించారు.

తాడిపత్రి అర్బన్: మిలాద్ ఉన్ నబీ వేడుకలను సోమవారం పట్టణంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలకు పట్టణంలోని సిద్దిబాషా దర్గా, యాసిన్‌పుర దర్గాను శోభాయమానంగా అలంకరించారు. ఆదివారం రాత్రి నుంచే ముస్లింలు మసీదుల్లో జాగారణ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువారం ఉదయం ముస్లింంలు భారీ జులుస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింంలు చిన్నా పెద్దా తేడా లేకుండా నారే తక్బీర్...అల్లాహో అక్బర్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ మతపరమైన జెండాలను చేతపట్టి పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి జులుస్‌లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అశోక్‌పిల్లర్ సమీపంలోని సిద్దిబాషా దర్గాలో ఎమ్మెల్యే చాదర్ సమర్పించి ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే రమేష్‌రెడ్డి కాలనీలో ముస్లింలు నిర్వహించిన మిలాదున్‌నబీ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. జులుస్‌లో పాల్గొన్న ముస్లింలకు స్థానిక బండా మసీదు, యాసిన్‌పురా దర్గా వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జులుస్‌లో ముస్లిం మతపెద్దలు, మైనార్టీలు పాల్గొన్నారు.

శింగనమల: మండలంలో సోమవారం మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు ఘనంగా చేసుకున్నారు. శింగనమలలో ముస్లింలు ఆదివారం రాత్రి గంధం నిర్వహించారు. ఆసరా కట్ట మసీదు నుంచి గంధాన్ని ఊరేగించారు. రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం ముస్లింలు ర్యాలీగా ఊరేగింపు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

పెద్దపప్పూరు: మిలాద్–ఉన్–నబీ పర్వదినం సందర్భంగా సోమవారం మండలంలోని నరసాపురం, కుమ్మెత, చింతరపల్లి, ముచ్చుకోట, పెద్దయక్కలూరు, పెద్దపప్పూరు, చాగల్లు, అమ్మలదిన్నె, వరదాయపల్లి తదితర గ్రామాల్లోని ముస్లింంలు స్వామి జెండాలను ఊరేగించారు. అనంతరం జామియామసీదులో మతపెద్దలు మహ్మద్ ప్రవక్త పుట్టినరోజు ప్రాశస్త్యాన్ని వివరించారు.

పెద్దవడుగూరు: మండలంలో సోమవారం ముస్లింఉలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మహమ్మద్ ప్రవక్త బోధనలను వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బుక్కరాయసముద్రం: మండలంలో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముస్లింలు మండల కేంద్రంలోని మస్జిదే తొయ్యబా నుంచి ర్యాలీ నిర్వహించారు. హమాలీ కాలనీ, జన చైతన్య నగర్ కాలనీలో ముస్లింలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

యాడికి: మిలాద్ ఉన్ నబీ వేడుకలను సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని రాయలచెరువులో ఘనంగా నిర్వహించారు. జామియా మశీదు, హజరత్ సికిందర్ హాజీవలి దర్గాలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

యల్లనూరు: మండల కేంద్రంలో ముస్లింలు మిలాధ్ ఉన్ నబీ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలతో పాటు గంధం ఊరేగింపు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మత పెద్ద రషీద్ నూరీ, మగ్బుల్, హైదర్, ఉస్మాన్ నజీర్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

పామిడి: పామిడిలో సోమవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండుగను ఘనంగా నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురష్కరించుకొని ఈపండుగను ఆచరించారు. ఈ సందర్భంగా దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముతువల్లీ బీ రుక్మాన్, బెంకి ముస్తఫా, షెక్షావలి, బారాన్‌సాబ్, ఫర్యాద్, షెక్షావలి పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నె, మర్తాడు, కల్లూరు,యర్రగుంట్లలో సోమవారం ముస్లిం లు ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు.



శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



బుక్కరాయసముద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



గుత్తిలో మహమ్మద్ ప్రవక్త కేశాలను దర్శించుకుంటున్న ముస్లింలు



గుత్తిలో ముస్లింల ర్యాలీ



తాడిపత్రిలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి



తాడిపత్రిలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి



యాడికిలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు



పామిడిలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు



గుంతకల్లులో ర్యాలీ చేస్తున్న మత పెద్దలు

మరమ్మతులకు నోచుకోని కంప్యూటర్!

యల్లనూరు: డ్వాక్రా సంఘాలకు రుణాలు, వైయస్ఆర్ ఆసరా, స్త్రీనిధి రుణాల మంజూరు, లోన్ల వివరాలు భద్రపరిచే కంప్యూటర్ మరమ్మతులకు గురైతే అధికారులు డబ్బులు లేవని మూలకు నెట్టేశారు. యల్లనూరు ఐకేపీ కార్యాలయంలో రెండు కంప్యూటర్లు ఉన్నాయి. వాటిలో ఒకటి కండీషన్‌లో ఉండగా మరొకటి మరమ్మతులకు గురైంది. మండలంలో 570 సంఘాలున్నాయని, ఒక కంప్యూటర్‌తో నడపడం చాలా కష్టంగా ఉందని సీసీలు వాపోతున్నారు. స్త్రీ నిధి బ్యాంకు, డిపాజిట్ల నగదులో ప్రతి నెలా రూ.25 వేలను కంప్యూటర్లు, కరెంటు బిల్లు, నెట్ బిల్లులకు ప్రభుత్వం చెల్లిస్తుంది. అన్ని ఖర్చులు పోనూ ప్రతి నెలా రూ.5వేలు దాకా మిగులుంతుంది.. ఆ నిధులు ఎక్కడికి పోతున్నాయో ఎవరికీ తెలీదు. వీటిపై పూర్తి స్థాయిలో కలెక్టరు వినోద్‌కుమార్ విచారిస్తే అసలు దొంగలు బయటపడుతారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పని నిమిత్తం కార్యాలయానికి వెళ్తే కంప్యూటర్ మరమ్మతులు లేక కాలయాపన చేస్తున్నారని పలువురు మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా డీఆర్‌డీఏ పీడీ ఓబులమ్మ స్పందించి కార్యాలయంలో జరుగుతున్న తీరును పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



ఐకేపీ కార్యాలయంలో మరమ్మతులకు నోచుకోని కంప్యూటర్

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని డ్యాం రోడ్డు సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు క్రిష్ణమూర్తి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా పెట్రోల్ బంకు వద్ద వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని బంధువులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఆరుగురిపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని మర్తాడుకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ధర్మతేజ, మధు, నవీన్, శ్రీకాంత్, సుబ్బరాయుడు, జె.నవీన్ పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామంకు చెందిన చందు పై దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

అపరిశుభ్రత నడుమ అంగన్‌వాడీ కేంద్రాలు



చిన్నజలాలపురంలో పిచ్చి మొక్కల మధ్య ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం గ్రామంలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఈ కేంద్రాలు చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. వాటిని తొలగించడానికీ సిబ్బంది చర్యలు తీసుకోలేదని, విషపురుగులు వస్తే ఎలానని అంగన్‌వాడి పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ నిర్మించాలని, అప్పటివరకు గడ్డి , పిచ్చి మొక్కలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వృద్ధులకు అన్నదానం

యాడికి: మండల కేంద్రంలోని కమలపాడు రహదారిలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో సోమవారం తాడిపత్రి మండలం కడవకల్లు గ్రామానికి చెందిన మాచర్ల దావీదు, లక్ష్మిదేవి దంపతులు వృద్ధులకు అన్నదానంతో పాటు వస్త్రదానం చేసినట్లు ఆశ్రమ నిర్వాహకుడు బత్తుల ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో దావీదు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీఐని కలసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

పామిడి: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన సీఐ యుగంధర్‌ను సోమవారం ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు కలిశారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబులేసు ఆధ్వర్యంలో సీఐకి అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేసి స్వాగతించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామాంజనేయులు, గంగాధర్, గవ్వల మంజునాథ్, మల్లేష్, శివ, అమర్నాథ్, కిట్ట తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



గుంతకల్లులో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న మత పెద్దలు, నిర్వాహకులు

గుంతకల్లు: మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా పట్టణంలోని రెడ్ డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి మెగా స్పందన లభించినట్లు ఆర్గనైజేషన్ ఫౌండర్ రెహమాన్ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, హజరత్ మస్తాన్ వలి దర్గా, టీబీ రోడ్డులో మూడు చోట్ల ఏర్పాటు చేసిన శిబిరాలను ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ రజాక్ పీరా సాహెబ్, మత పెద్దలు మౌలానా ముఫ్తీ మన్సూర్ ఆలీ ప్రారంభించారు. ఈ సందర్భం దాదాపు 160 మంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకుతో పాటు గోపీ బ్లడ్ బ్యాంకుకు అందజేసినట్లు రెహమాన్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గులాబ్ మహమ్మద్, షఫీ, ఉపాధ్యక్షుడు చింత దివాకర్, భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ నాయకులు నాగరాజు, షబ్బీర్, ప్రాణదాత బ్లడ్ డోనర్స్ నాయకులు తిప్పన్న, హనుమంతు, లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ నాయకులు రంజాన్, కారుణ్య హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ నియామకం ఎప్పుడో?

శింగనమల: నియోజకవర్గ కేంద్రం శింగనమల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ బదిలీ అయి నెల అవుతున్నా ఉన్నతాధికారులు కొత్త ఎస్ఐని నియమించలేదు. అలాగే స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో మండలంలో శాంతి భద్రతల సమస్యలు నెలకొంటున్నాయి. ఇక అక్రమ ఇసుక రవాణా, మట్టి తరలింపు జోరుగా సాగుతున్నాయి. పోలీసులు దాడులు చేస్తున్నా, అక్రమార్కులు ఇసుక తరలింపును ఆపడం లేదు.

పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత

శింగనమల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐతో కలిపి 26 మంది సిబ్బంది ఉండాలి. గత ఆగస్టు 19న ఎస్ఐ చంద్రశేఖర్ కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి శింగనమల పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐని ఎవరినీ నియమించలేదు. స్టేషన్‌లో ఏఎస్ఐలు ముగ్గురుండాలి. కానీ ఒక్కరు మాత్రమే ఉన్నారు. హెడ్ కానిస్టేబుళ్లు ఏడుగురున్నారు. కానిస్టేబుళ్లు 15 మంది ఉండగా, అందులో ఒకరు సర్కిల్ పోలీస్‌స్టేషన్, ఒకరు డీఎస్పీ కార్యాలయంలో, ఇద్దరు డీపీఓలో డెప్యూటేషన్‌పై ఉన్నారు. ఇక మిగిలిన 11 మందిలో ఒకరు మహిళా కానిస్టేబుల్. వారు కూడా బందోబస్తులకు వెళ్తున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ఎస్ఐ లేకపోవడంతో ఇసుక అక్రమ రవాణకు పోలీసులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. మండలంలోని కల్లుమడి, తరిమెల, నిదనవాడ, రాచేపల్లి సమీపంలోని పెన్నానది నుంచి ఇసుక తరలిపోతోంది. అలాగే పి.జలాలపురం, కొరివిపల్లి, జూలకాల్వ, పెరవలి గ్రామాల సమీపంలో ఉన్న వంక నుంచి ఇసుక అక్రమ రవాణ జోరుగా సాగుతోంది. శని, ఆదివారాల్లో సిబ్బంది ఎవరు ఉండరని, తోటల్లోకి పగలు ఇసుక డంప్ చేసుకొని , రాత్రిళ్లు టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. లోలూరు గ్రామ సమీపంలోని వంక నుంచి మట్టిని శనివారం రాత్రి అక్రమంగా తరలించారు. సిబ్బంది కొరతతో పోలీసులు అక్రమార్కులపై చర్యలు తీసుకోలేక పోతున్నారు.

సర్కిల్ పరిధి ఇలా..

శింగనమలలో సర్కిల్ పోలీస్‌స్టేషన్ ఉంది. శింగనమల, గార్లదిన్నె, నార్పల మండలాలున్నాయి. సీఐ కౌలుట్లయ్య మూడు మండలాలను పర్యవేక్షిస్తున్నారు. శింగనమల పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐ లేకున్నా, మండలంలో శాంతి భద్రతలపై ఆయన ప్రత్యే దృష్టి పెట్టారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నా.. వారిలో మార్పు రావడంలేదు.



శింగనమల పోలీస్‌స్టేషన్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



శింగనమల పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐ నియామకంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే ఎస్ఐని నియమిస్తారు. మండలంలో శాంతి భద్రతలపై గట్టి చర్యలు తీసుకుంటున్నాం.

– సీఐ కౌలుట్లయ్య, శింగనమల